మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న షరీఫ్, కలెక్టర్ రంజిత్ బాషా

ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి

● వెంటాడుతున్న తాగునీరు, రోడ్లు, కాలువలు, కబ్జాలు ● నేడు కర్నూలు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలో అనేక సమస్యలున్నాయి. ఎప్పటికప్పుడు పాలకులు హామీలు ఇస్తూ అమలు చేయడంలో విఫలమవుతున్నారు. నగరపాలక బడ్జెట్‌కు తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే అన్నివిధాల అభివృద్ధి సాధ్యమవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా నిధులు రాబట్టేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేసి వెంటబడాలి. కర్నూలు నగరపాలక బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహిస్తున్నారు. ప్రధాన సమస్యలు తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, పార్కుల కబ్జాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పారిశుద్ధ్య కార్మికులను తగినంత మందిని నియమించాలి. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం.

ప్రధాన సమస్యలపై ప్రజాసంఘాలు, ప్రజలు అనేక సంధర్భాలతో నిరసనలు తెలిపి పాలకులకు విన్నవిస్తున్నా పరిష్కారం కావడం లేదు. కర్నూలు నగరంలో ప్రజలు ప్రతి వేసవిలో తలడిల్లుతున్నారు. శివారు కాలనీలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కర్నూలు నగర జనాభా 6 లక్షలు పైగా ఉండడంతో వారికి కావలసిన తాగునీటిని అందించలేక అధికారులు తీవ్ర హైరానా పడుతున్నారు. అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలంలో శివారు కాలనీలోరోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం పడితే ఇంటికి చేరేందుకు ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కులు రక్షణ కల్పించకలేక కబ్జాలకు గురవుతున్నాయి. వాటిని రక్షణ గోడలు ఏర్పాటు చేసి సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది. నగరంలోని రోడ్లను సైతం కబ్జాదారులు కబ్జాలు చేసి ఇల్లు నిర్మాణం చేస్తున్నారు. వాటిపై దష్టి సాధించకుండా పట్టణ ప్రణాళిక విభాగం వారు డబ్బులు దండుకుంటూ మొద్దు నిద్రపోతున్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్నూలు నగరంలో 133 సచివాలయాలు ఉన్నా అందులో పనిచేసే ప్లానింగ్ సెక్రటరీలు ఎవరి పరిధిలో వారు కొత్తగా నిర్మించే గృహాలకు అనుమతులు ఇచ్చే సందర్భాల్లో కొలతలు కొలిచి వారికి వారి హద్దుల్లోనే ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలి. ఇక కొందరు చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఖాళీ కనిపిస్తే చాలు బాగా వేసేయడమే అన్నట్లు రాజకీయ నాయకులు అండదండలతో కబ్జాలు చేస్తున్నారు. అంతా అయిన తర్వాత పోయి కబ్జా చేస్తున్నావని కూల్చి వేయడానికి వెళ్తే వారు కోర్టుకు వెళ్లడం ఇలాంటి సమస్యలతో అధికారులు సతమతమవుతున్నారు. నగరంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు లేక కేవలం ఆటో రంగంపై ఆధారపడి జీవించేవారు ఎక్కువయ్యారు. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు ఉపరితల వంతెనలు (ఫ్లై ఓవర్ బ్రిడ్జి)లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు ఇబ్బంది పడే ప్రాంతాలను గుర్తించి రోడ్లను విస్తరించాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. నగరంలో కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది. వాటిని నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. టిడిపి ప్రభుత్వంలో టిట్కోగృహాలను నిర్మించి ఇప్పటివరకు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం గృహాలకు సంబంధించిన వినతులు వస్తున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజాధనాన్ని వృథా చేయకుండా నేడు నిర్వహించు సర్వసభ్య సమావేశంలో బడ్జెట్లను కేటాయించి అభివృద్ధి చేసి అందరి మన్ననలు పొందాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశాలు

కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాలు గురువారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎస్‌బిఐ కాలనీలోని కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 12 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఉంటుంది. తొమ్మిది అజెండాలపై పాలకవర్గ సభ్యులు చర్చించనున్నారని కమిషనర్ వెల్లడించారు. నగర మేయర్ బివై. రామయ్య అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్, ఎంపిలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు అవుతారని తెలిపారు.

కబ్జాలు ,నీరు, రోడ్లు, కాలువలపై ఫోకస్ పెట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

కర్నూలు నగరం రోజురోజుకు విస్తరించడంతో నగర జనాభా కూడా విపరీతంగా పెరిగిపోతుంది. వారికి అనుగుణంగా కావాల్సిన ప్రధాన అవసరాలు తాగు నీటి కోసం అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, శివారు కాలనీలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు కోసం పైప్ లైన్లకు, రోడ్లు, కాలువలకు బడ్జెట్ సమావేశంలో ఎక్కువ నిధులు కేటాయించాలి. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా రక్షించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం పైఉంది. పార్కుల అభివృద్ధి నిలిచిపోయింది. పార్కులు అభివృద్ధి చేసి వాటి నిర్వహణ బాధ్యతలను తీసుకొని ప్రజలకు కావాల్సిన వ్యాయామ పరికరాలు(పిల్లలకు పెద్దలకు) అమర్చాలి. హంద్రీ, ఒక్కెరలకు ఇరువైపులా రోడ్లు వేసి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.వాటి కోసం కూడా నిధులను కేటాయించి పూర్తి చేయాలి.

వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- మైనారిటీ సలహాదారుడు ఎం.ఎ. షరీఫ్
- మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వక్ఫ్ బోర్డు భూములు అన్నిక్రాంతం కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలులో రెండో రోజు పర్యటనలో భాగంగా సంతోష్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎపి.మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే మనిషి నాగరికతతో పాటు సంపూర్ణమైన జీవితం గడపగలుగుతారన్నారు. విద్యార్థులు పేదరికాన్ని శిక్షగా భావించకుండా విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు అధిరోహించేలా కృషి చేయాలన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కూడా పేదరికం నుండే ఉన్నత స్థాయికి వచ్చారన్నారు. తల్లితండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటారని, వారి కలలను సాకారం చేసేలా విద్యార్థులు కృషి చేస్తూ పోటీతత్వంతో మంచి మార్కులు సాధించాలన్నారు. పదవ తరగతి పునాది కాబట్టి మంచి మార్కులు సాధించేలా బాగా చదవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రహరీ గోడ, డైనింగ్ హాల్ తదితర వసతులను ఏర్పాటు చేస్తానని తెలిపారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ సంతోష్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో గ్రౌండ్, ఇతర వసతులు చాలా వరకు బాగున్నాయని, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్‌ల నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారుచేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పాఠశాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంతోష్‌నగర్ బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో సిసి టీవీ కెమెరాల ఏర్పాటుకి ఎస్టిమేట్ లను సిద్ధం చేయాలని కలెక్టర్ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఎస్‌పి మహబూబ్ బాషా, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్‌బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు క్వింటాలుకు రూ.18 వేలివ్వాలి

- కంపెనీలపై చర్యలు తీసుకోవాలి
- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పొగాకు రైతులకు క్వింటాలుకు రూ.18000 ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతులను మోసగిస్తున్న పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు సమీపంలోని పొగాకు అలయన్స్ కంపెనీ వద్ద వివిధ మండలాల పొగాకు రైతులతో మాట్లాడి వారి సమస్యలను రైతు సంఘం ప్రతినిధి బృందం అడిగి తెలుసుకుంది. జి. రామకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి ఎస్.మధు సూదన్, రైతుసంఘం కల్లూరు మండల నాయకులు దస్తగిరి పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలో ఈఏడాది వేలాది ఎకరాలలో పొగాకు సాగుచేశారన్నారు. పంట చేతికి వచ్చేసరికి పొగాకు కంపెనీల యాజమాన్యం రైతులను వివిధ రకాల పేర్లతో నల్లగా ఉందని, తేమ ఎక్కువగా ఉందని 'రీ' బెయిళ్ చేసి లేదా నామమాత్రమైనదిగా రూ.ఏడు వేల నుండి రూ.8 వేల వరకు ఇస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. గతేడాది పొగాకు కంపెనీలు రైతులకు ఆశ చూపి పొగాకు పంట వేస్తే రూ.లక్షలాది ఆదాయం వస్తుందని నమ్మబలికి క్వింటాలుకు రూ.16 నుండి రూ.18 వేలు ఇస్తామని అగ్రిమెంట్ చేసుకుని ఇప్పుడు రైతులకు నష్టదాయకం కలిగించే విధంగా చర్యలు చేపట్టడం దారుణమన్నారు. రైతులు , కౌలు రైతులు ఎకరాకు రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు ఖర్చుపెట్టి పొగాకు సాగు చేశారని దిగుబడి ఎకరాకు 8 నుండి 10 క్వింటాలు వస్తుందని అన్నారు. కంపెనీ యాజమాన్యం రేటు రూ.7 నుండి రూ.15 వేల మధ్యలో వేస్తున్నారన్నారు. దీనివల్ల రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక లబోదిబోమంటున్నారన్నారు. కంపెనీ యాజమాన్యం గత సంవత్సరం రూ.16నుంచి రూ.18 వేలు క్వింటాలకు ఇచ్చారన్నారు. ఈ సంవత్సరం ఏకంగా రూ.4.7 వేలు తగ్గించడం దారుణమన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి పొగాకు రైతుల పంటలను పరిశీలించి కంపెనీల యాజమాన్యం తో మాట్లాడి తగు చర్యలు చేపట్టి క్వింటాలుకు రూ.16 నుండి రూ. 18 వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పొగాకు రైతులను కూడగట్టి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఆర్‌టిసి బస్సు, బైక్ ఢీకొని

తండ్రి, కొడుకు మృతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మండలం బోరబండ గ్రామ సమీపంలో ఆర్‌టిసి బస్సు, బైక్ ఢీకొని తండ్రి, కొడుకు మృతి చెందారు. గ్రామీణ ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు... మండలంలోని కోటేకల్ గ్రామానికి చెందిన సామ్యేల్ (27), అతని భార్య శాంతి, కొడుకు గౌతమ్ (2) కలిసి బుధవారం ఎమ్మిగనూరులో ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న పలమనేరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు (ఎపి 39 యుఎం 6378) ఢీ కొట్టడంతో తండ్రి సామ్యేలు, కొడుకు గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందారు. భార్య శాంతి తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇందు, స్వాతి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సామ్యేల్ (ఫైల్)

ఢీకొట్టిన బస్సు

వక్ఫ్ చట్టసవరణను రద్దు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుకు ఆవాజ్ కమిటీ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ చట్టసవరణను రద్దు చేయాలని ఎపి రాష్ట్ర ప్రభుత్వం సలహాదారు ఎం.ఎ.షరీఫ్‌కు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఆయన కర్నూలు వచ్చిన సందర్భంగా ప్రభుత్వ అతిథి గృహంలో ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్ఎండి షరీఫ్ ఆధ్వర్యంలో కలిశారు. వారు మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లిం మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మైనార్టీలపై అనేక రూపాలలో దాడులు కొనసాగిస్తుంది అందులో భాగంగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతిపాదనలను ప్రవేశపెట్టిందని, ఈ చట్ట సవరణ చాలా దుర్మార్గమైనదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తొమ్మిది లక్షల 40 వేల ఎకరాల భూములు కలిగిన మూడవ అతిపెద్ద సంస్థ వక్ఫ్ బోర్డ్ అని, ముస్లిం మైనార్టీల భాష, సాంస్కృతిక, ఆర్థిక ,విద్య ,ఉపాధి, సామాజిక, అభివృద్ధి భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ధార్మిక కార్యక్రమాల కోసం దూర దృష్టితో పూర్వీకులు తమ ఆస్తులను భూములను వక్ఫ్ చేశారన్నారు. బిల్లు సవరణ పేరుతో అన్యమతస్తులను వక్ఫ్ బోర్డులో పెట్టడం వల్ల వక్ఫ్ లక్ష్యాలను తూట్లు పొడవడమే అవుతుందన్నారు. .కేంద్ర ప్రభుత్వానికి ముస్లింలు అభివృద్ధి పట్ల ,వక్ఫ్ ఆస్తుల రక్షణ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. రంగనాథ మిశ్రా సిఫారసులను, సచార్ కమిటీ నివేదికలను తెప్పించుకొని ముస్లింల అభివద్ధికి చేసిన సూచనలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ చట్ట సవరణ పై ఒత్తిడి తీసుకొని వచ్చి వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్ఎండి షరీఫ్‌కు బీడి కార్మికులకు ఇంటి స్థలాల ఒరిజినల్ పట్టాలి ఇవ్వాలని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మరో వినతి పత్రం ఇచ్చారు.

షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ నాయకులు

అధునాతన పద్ధతిలో కేన్సర్‌కు వైద్యం

స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : అధునాతన పద్ధతిలో కేన్సర్‌కు వైద్యం చేసే సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. జిజిహెచ్‌లోని స్టేట్‌కేన్సర్ ఇనిస్టిట్యూట్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ విభాగంలో ఉండే లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, ఓటీ థియేటర్స్, జనరేటర్, తదితర విభాగాలకు సంబంధించిన అభివృద్ధి పనులను తనిఖీ చేశామని తెలిపారు. క్యాన్సర్ విభాగంలో డేకేర్ కీమోథెరపీ ఐపి పేషెంట్లకు చేస్తున్నట్లు తెలిపారు. కేన్సర్ విభాగంలో బుధవారం అల్ట్రాసౌండ్ మెషిన్‌ను ఇన్‌స్టాలేషన్ ప్రాసెస్ పూర్తి చేసినట్లు తెలిపారు. లిక్విడ్ ఆక్సిజన్ , ఆక్సిజన్ పైప్ లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. క్లీనింగ్ పనులు పూర్తయినట్లు తెలిపారు. కేన్సర్ విభాగంలో ఉన్న జనరేటర్ పనులు జరుగుతున్నాయని అన్నారు. అధునాతనమైన యంత్రాలతో త్వరలో కేన్సర్ పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సిఎస్ఆర్ కె ప్రకాష్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని పాల్గొన్నారు.

బి.తాండ్రపాడు సర్పంచి జయన్నను కలిసిన బాధితులు

పట్టాలకు స్థలాలు చూపండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం, బి తాండ్రపాడు గ్రామ పరిధిలో గ్రామ పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలం చూపించాలని బాధితులు కోరారు. బుధవారం గ్రామ ప్రజలు సర్పంచి ఆకెపోగు జయన్నతో కలిసి కోడుమూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో నాటి ప్రభుత్వం గ్రామ సర్వేనెంబర్ 177లో సుమారు 1300 పట్టాలు మంజూరు చేసిందన్నారు. నేటి వరకు స్థలం చూపలేదన్నారు. వెంటనే పట్టాదారులకు స్థలం చూపాలని స్థలం లేని పేదలకు కూడా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అందుకు విష్ణువర్ధన్ రెడ్డి స్పందిస్తూ ప్రజలకు తగిన న్యాయం జరిగే విధంగా పేదలకు స్థలంతో పాటు అర్హులైన పేదలకు కూడా పట్టాలు మంజూరు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'ఉపాధి' పనిదినాలు పెంచాలి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి నారాయణ

ప్రజాశక్తి-కోడుమూరురూరల్

ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచి , పెండింగు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను కెవి నారాయణ, సిఐటియు మండల కార్యదర్శి కె. మోహన్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కొంతమందికి పనిదినాలు పూర్తయిపోయాయని, పూర్తయిన కుటుంబాలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని,తక్షణం అదనంగా మరో వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలకు ఇబ్బందిగా ఉంటుందని, తక్షణం పనిచేసిన వారంలోగా వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అధికారం యంత్రాంగం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రెగ్యులర్‌గా పని చేస్తున్న కూలీలకు పని దినాలు అయిపోయాయని, వారికి అదనంగా వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం జాబ్ కార్డులు దండిగా ఉన్నాయని, పనులు జరగలేదనే వాదన వినిపిస్తుందని, ఇది సరైనది కాదన్నారు. రెగ్యులర్‌గా పనిచేసే వారికి సనిదినాల కల్పించాలని వారి డిమాండ్ చేశారు. పని చేసిన వారికి వారంలో పేస్లిప్పులు ఇచ్చేవాళ్ళు, కూలీలకు ఎంత పని చేసామో అని అవగాహన ఉండేదన్నారు. ప్రస్తుతం పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల పనిచేయని కొందరు అదనంగా పేర్లు చేర్చుకునే ప్రమాదం కూడా ఉందన్నారు. పనిచేసిన వారందరికీ పేస్లిప్‌లు ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ జాబ్‌కార్డులివ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పర్యటనలో గ్రామ నాయకులు ఎర్రమల, రవి, తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కెవి.నారాయణ

శనగరైతు అప్పులపాలు

పెరిగిన ఖర్చులు-తగ్గిన దిగుబడి

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలంలోని ప్రకతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది శనగ పంట సాగు చేసిన రైతులకు నష్టాలు చవిచూశారు. మండలంలోని తుగ్గలి, రాతన, అమీనాబాద్, సుమారు 2100 ఎక రాల్లో శనగ పంటను సాగు చేశారు. ఎకరాకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయం, కోత కూలీలు, నూర్పిళ్లకు దాదాపుగా రూ.30 వేలను ఖర్చు చేశారు. ఒక ఎకరాకు కౌలు రూ.10 వేలు కలిపి మొత్తం రూ.40 వేల వరకు ఖర్చు అయింది. గత రెండు నెలల క్రితం కురిసిన వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుతం శనగ పంటను కోసి నూర్పిళ్లు చేస్తున్నారు. ఒక ఎకరాకు కేవలం రెండున్నర క్వింటాళ్ల నుంచి మూడున్నర క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.5000 మాత్రమే ఉంది. ఎకరాకు దాదాపుగా రూ.25 వేల నష్టాన్ని రైతులు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో దిగుబడి రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించి గిట్టుబాటు ధరకల్పించాలని కోరుతున్నారు.

కోసిన శనగ పంట

ప్రభుత్వం ఆదుకోవాలి: రైతు మంజుల

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల రిత్యా శనగ పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరాకు కేవలం రెండున్నర క్వింటాళ్ల నుంచి కేవలం మూడున్నర క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో భారీగా నష్టపోయాం. ప్రభుత్వం శనగ పంటకు ఫసల్ బీమా పథకం ద్వారా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

పెట్టుబడి కూడా దక్కడం లేదు:రైతు కాసీం

ఎకరాకు సగటున రూ.25 నుంచి రూ.30 వేలకుపైగా పెట్టుబడి అవుతుంది. తుఫాన్ ప్రభావంతో సగటున ఆరు క్వింటాళ్లు కూడా రావడం లేదు. ప్రైవేటు వ్యాపారులకు అమ్మితే సగటున క్వింటా రూ.5000 లకు కొనుగోలు చేసినా అందులో రవాణా, హమాలీ, ఇతర ఖర్చులు పోనూ 20 వేలు కూడా మిగలవు.

ఫసల్ బీమాను వర్తింప చేయాలి
సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు

ఈ ఏడాది సుమారు 2100 ఎకరాలలో శనగ పంట సాగు చేశారు. ఎకరాకు 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీంతో సుమారు ఎకరాకు రూ.25 వేల నష్టం వచ్చింది. ప్రభుత్వం శనగ పంటకు ఫసల్ బీమా పథకం వర్తింప చేయాలి.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

సూపర్‌సిక్స్ పేరుతో పచ్చిదగా

-అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు
-వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సూపర్ సిక్స్ అమలు పచ్చిదగాఅని, ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరోపించారు. బుధవారం కల్లూరు అర్బన్ 35 వార్డులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలతో కనికట్టు చేసి, దిగ్రేట్ మోసగాడుగా ఎట్టకేలకు తన ముసుగు మొత్తం తీసేశారని అన్నారు. ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చారో ఇవాళ ఆ హామీలను నెరవేర్చలేమని, పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించి ప్రజలను దగాచేశాడని అన్నారు. చంచంద్రబాబు అధికారంలోకి వస్తే చంద్రముఖిని మళ్లీ లేపినట్టేనని, పులినోట్లో తల పెట్టడమేనని మా నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చేసిన హెచ్చరికలు మరోసారి నిజం అయ్యాయని అన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలను ఒక్కసారి చూడండని, అభివద్ధి చేస్తే సంపద సృష్టించబడుతుందని సంపద సృష్టిస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. తాము చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని, ఇంకా బెటర్‌గా ఇస్తాం. పీ4 తీసుకొస్తాం. నీతి ఆయోగ్ నివేదికపై ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు చెప్పారని తెలిపారు. నాయకులు అక్కిమి హనుమంత రెడ్డి, పందిపాడు శివశంకర్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, లక్ష్మీపురం నారాయణరెడ్డి, ఎద్దుల శివారెడ్డి వెంకటేశ్వర్లు, తిరుమలేష్ గౌడ్ హుస్సేన్ ఆలంబోయ శివ పాల్గొన్నారు.

పింఛన్లకు రూ 102.89 కోట్లు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి మాసానికి సంబంధించిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల నగదు పంపిణీకి రూ.102.89 కోట్ల నిధులను జిల్లాకు విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో మొత్తం ఫిబ్రవరి నెలలో 2,39,332 పెన్షన్ లబ్ధిదారులకు ఈ నిధులను ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లకు నిధుల సొమ్మును జమ చేశారు.

డిగ్రీ ,బిఇడి ఇన్‌స్టంట్ పరీక్షలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 2017 నుండి 18 వరకు డిగ్రీ , 2015 నుండి 2019 వరకు బిఇడి కోర్సు పూర్తిచేసు చేసుకోలేని వారికి ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విసి ఎన్‌టికె నాయక్ ఉత్తర్వులను జారీ చేశారు. డిగ్రీ కోర్సులకు సంబంధించి ఫిబ్రవరి 1 నుండి 5 వరకు థియరీ పరీక్షలను 6 నుండి మార్చి 15వరకు ఉంటాయన్నారు. బిఇడికిసంబంధించి ఫిబ్రవరి 1 నుండి 4 వరకు ప్రాక్టికల్స్ 6 నుండి 17 వరకు, థియరి పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా గోనెగండ్ల

- వంద శాతం పన్నుల వసూలు చేయాలి : డిపిఒ భాస్కర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

పంచాయతీ కార్యదర్శికి సూచనలు

ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా గోనెగండ్ల మేజర్ పంచాయతీని ఎంపిక చేసినట్లు డిపిఒ జి.భాస్కర్, ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. బుధవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది ఉదయాన్నే గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి, వీధుల నుంచి చెత్తను సేకరించాలని తెలిపారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయాలని, దానిని రైతులకు అమ్మడం ద్వారా సంపదను సృష్టించాలని సూచించారు. సిబ్బంది గ్రామంలో వందశాతం పన్నులను వసూలు చేసి గ్రామానికి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. గోనెగండ్ల గ్రామాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాలను నియంత్రించడంతోపాటు బాలిక విద్యను ప్రోత్సహించడం, మహిళల్లో ఆర్థిక స్వావలంబనను పెంపొందించి స్నేహపూర్వకమైన వాతావరణంలో మహిళా సాధికారతను సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పంచా యతీ కార్యదర్శికి, సిబ్బందికి వారు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇఒఆర్‌డి అనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, సర్పంచి హైమావతి, వార్డు మెంబర్ అక్బర్, సిబ్బంది మలాంగ్, అనిల్, సుభాన్, ఎ.మలాంగ్ పాల్గొన్నారు.

పాఠశాలలో డ్రెయినేజీ ఏర్పాటు చేస్తాం

- రూ.5 లక్షల సొంత నిధులతో నిర్మాణం - రిటైర్డ్ ఐజి ఇక్బాల్ మహ్మద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాఠశాల ఉపాధ్యాయులతో రిటైర్డ్ ఐజి ఇక్బాల్ మహ్మద్

పట్టణంలోని మాచాని సోమప్ప ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తామని రిటైర్డ్ ఐజి ఇక్బాల్ అహ్మద్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్న మురుగు నీటి, మురుగుదొడ్ల నుంచి వచ్చే నీటిని బయటికి పంపడానికి అవసరమయ్యే డ్రెయినేజీ నిర్మాణానికి రిటైర్డ్ ఐజి ఇక్బాల్ అహ్మద్ ముందుకొచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల డ్రెయినేజీ సమస్యను ఇక్బాల్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.5 నుంచి రూ.6 లక్షలు ఖర్చు అయ్యే డ్రెయినేజీని సొంత ఖర్చులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కేవలం 15 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. గతంలో ఇదే పాఠశాలలో దాదాపు రూ.15 లక్షలతో గుంతలను పూడ్చి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చేశామని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలగా ఎమ్మిగనూరు బాలికల పాఠశాల ఉండడం గర్వకారణమన్నారు. విద్యార్థులకు అనుగుణంగా మరో 5 నుంచి 8 మురుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వ పిఇటిల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.జాకీర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, కర్నూలు మాజీ కార్పొరేటర్ సురేంద్ర, కమీషన్ మర్చంట్ ఖాజా బందేనవాజ్, చాంద్ పాల్గొన్నారు.

30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి గుర్తింపు పద్మశ్రీ

- లక్షల డప్పులు, వెయ్యి గొంతుకలను జయప్రదం చేయండి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - గోనెగండ్ల

30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిందని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య మాదిగ తెలిపారు. బుధవారం గోనెగండ్లలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజిహల్లి మహదేవ్ మాదిగ, గోనెగండ్ల అడ్వకేట్ వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ముఖ్యఅతిథిగా ఆనంద్ చైతన్య మాదిగ హాజరయి మాట్లాడారు. మందకృష్ణ మాదిగ చిన్నపిల్లల గుండె ఆపరేషన్లపై పోరాడి ఆరోగ్యశ్రీ పథకం రావడానికి కారణమయ్యారన్నారు. వికలాంగుల పింఛన్లతో పాటు వృద్ధులు, వితంతువుల పింఛన్ల ప్రదాతగా నిలిచారని కొనియాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్షల డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ డప్పుతో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

అధికారులను సన్మానిస్తున్న నాయకులు

ఉత్తమ సేవలందించి కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎంపిడిఒ సుబ్బరాజును సిపిఎం ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మల్లయ్య సన్మానించారు. బుధవారం సిపిఎం నాయకులు అధికారులకు పూలమాలలు, శాలువా వేసి సన్మానించారు. సిపిఎం మండల కన్వీనర్ ఈరన్న పాల్గొన్నారు.

ఆగని వలసలు...

- ఖాళీ అవుతున్న గ్రామాలు..!
- వలసల నివారణలో అధికారులు విఫలం
- కనిపించని సీజనల్ హాస్టళ్లు
- 13 ఏళ్లకుపైగా 'ఉపాధి'కి నోచని ఎస్సీ కాలనీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలో వలసలు ఆగడం లేదు. మండల ప్రజలు గ్రామాల్లో పనుల్లేక వలస వెళ్లడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వేలమంది ప్రజలు వలస వెళ్లినా వలసలను అరికట్టడంలో అధికారులు విఫలం చెందారు. గ్రామాల్లో సీజనల్ హాస్టళ్లు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను వెంట తీసుకెళ్తున్నారు. నందవరం ఎస్సీ కాలనీలో 13 ఏళ్లకుపైగా ఉపాధి హామీ పనుల్లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వలస వెళ్తున్న కూలీలు

ప్రజలు వలస వెళ్లడం రోజురోజుకు పెరగడంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. నందవరం గ్రామంలో ప్రజలు వలస బాట పట్టడం వల్ల వీధులు జనసంచారం లేక బోసిపోతున్నాయి. గ్రామంలో సుమారు 2 వేల మంది పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణకు వలస వెళ్లారు. ప్రజలకు ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించి వలసలను అరికట్టడంలో అధికారులు విఫలం చెందారు. గ్రామంలో ఉపాధి హామీ చట్టం తూతూమంత్రంగా కొనసాగుతోంది. పూర్తిస్థాయిలో ఉపాధి హామీ చట్టం అమలు కావడం లేదు. చాలా వీధుల్లో ప్రజలకు ఉపాధి హామీ పనులను కల్పించడం లేదు. సీజనల్ హాస్టళ్లు లేకపోవడంతో పిల్లలను ఇక్కడే వదిలి వెళ్లలేక తల్లిదండ్రులు వెంట తీసుకెళ్తున్నారు. పిల్లల చదువులకు వలసలు శాపంగా మారాయి. పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తోంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వాలు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినా వాటిని ఏర్పాటు చేయడంలో అధికారులు చొరవ చూపడం లేదు.

ఉపాధి కూలితో కుటుంబాన్ని పోషించుకోలేం

- నాగరాజు, నందవరం

ఉపాధి హామీ చట్టానికి రోజుకు కూలి రూ.300 ఇస్తామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. సంవత్సరాలుగా పని చేసినా ప్రభుత్వం ప్రకటించిన కూలి వచ్చిన దాఖలాలు లేవు. కష్టపడి పని చేసినా పనికి తగిన కూలి రావడం లేదు. ఉపాధి హామీ చట్టం వల్ల వచ్చిన కూలి డబ్బులతో మా కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతోంది.

వలసలు నివారిస్తాం

- ఎంపిడిఒ పుల్లయ్య

మండల ప్రజలకు ఉపాధి కల్పించి వలసలు నివారిస్తాం. చాలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఉపాధి పని కల్పించాం. పని చేసిన ప్రతిఒక్కరికీ రూ.290 వేతనాలు వచ్చింది. శ్రమకు తగిన వేతనాలు రావన్న అపోహలో ప్రజలు ఉన్నారు. వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం. నందవరం గ్రామం ఎస్సీ కాలనీ వాసులకు సోమవారం నుంచే ఉపాధి హామీ పనులు కల్పిస్తాం.

13 ఏళ్లకుపైగా 'ఉపాధి'కి నోచని ఎస్సీ కాలనీ

- శ్యావల రామన్న, నందవరం

గత 13 ఏళ్లగా ఎస్సీ కాలనీ ప్రజలకు ఉపాధి హామీ చట్టాన్ని అధికారులు చేపట్టడం లేదు. మా కాలనీపై అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. పొలం పనులు పూర్తి కావడం వల్ల వీధి ప్రజలకు పనుల్లేక ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వరకు బతుకుదెరువు కోసం ప్రతి ఏడాది మాదిరిగానే గ్రామాన్ని వదిలి వలస వెళ్తున్నాం. వలస వెళ్లి పనులు చేస్తున్న సమయంలో అదుపు తప్పి కొంతమంది కొన్ని సందర్భాల్లో చనిపోయారు. రెండు నెలల క్రితం ఉపాధి అధికారులు వీధిని సందర్శించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. పని కల్పిస్తామని ప్రజలకు హామీఇచ్చారు. జాబ్ కార్డులు బ్లాక్ అయ్యాయి.. అప్‌డేట్ చేస్తామని మా దగ్గర ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్స్, జాబ్ కార్డ్ జిరాక్స్ తీసుకెళ్లారు. అప్పటి నుంచి అధికారులు మమ్మల్ని పలకరించిన దాఖలాలు లేవు. మేమే అధికారులను అడిగినా సర్వర్ లేదని జాబ్ కార్డు అప్‌డేట్ కాలేదని చెబుతున్నారు.

వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 16 గ్రామాల్లో వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించే బాధ్యత అందరిపై ఉందని, అందుకు తగ్గట్టుగానే విధుల్లో కృషి చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎపిఒ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వలసలు వెళ్లకుండా పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వేతనాలు సకాలంలో అందుతున్నందున గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరైన అవగాహన కల్పిస్తూ పనులకు వెళ్లేలా కృషి చేయాలని తెలిపారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే వారందరూ త్వరగా పూర్తి చేసుకుంటే సకాలంలో నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎపిఒకు సూచించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ గీతావాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు వెళ్లాలని తెలిపారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రోజుకు కూలి రూ.300 వస్తుందని చెప్పారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లి కొంతమంది కూలీలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కోరిన ప్రతి ఒక్కరికీ పనులు పెట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మస్టర్‌ను తనిఖీ చేశారు.

మస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

భూ కబ్జాలపై మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో భూకబ్జాలపై రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఇటీవల మంగళగిరి టిడిపి ప్రధాన కార్యాలయంలో మంత్రి లోకేష్‌ను కలిసినట్లు తెలిపారు. ఆదోని ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథి హయాంలో జరిగిన భూ అక్రమాలు, అవినీతి, అవకతవకలు, అలాగే మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హయాంలో జరిగిన భూకబ్జాలు, అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వింత వ్యాధితో చిన్నారి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

వింత వ్యాధితో చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉపరహాల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన బోయ వెంకటేష్, ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె బోయ కవిత(3)ను పది రోజుల క్రితం ఆదోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. తగ్గకపోవడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మెదడు వాపు, ర్యాబిస్ లక్షణాలతో బోయ కవిత మృతి చెందిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

సమన్వయంతో పని చేయాలి

- కుంభాభిషేక మహోత్సవం విజయవంతానికి కృషి
- ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం మహా కుంభాభిషేక మహోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే కుంభాభిషేక మహోత్సవం ఏర్పాట్లపై బుధవారం ఉరుకుందలోని పరిపాలన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ విజయరాజు అధ్యక్షతన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 1, 2, 3న జరిగే మహా కుంభాభిషేక మహోత్సవానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లపై వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. తాగునీరు, క్యూలైన్లు, భోజన సౌకర్యాలు, పార్కింగ్, హెలిప్యాడ్ కోసం స్థలం, విఐపిలకు ప్రత్యేక ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పారిశుధ్యం ప్రత్యేక సిబ్బంది, భద్రత కోసం పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే భక్తులను అంచన వేసి వారికి ఏర్పాట్లను కల్పించాలన్నారు. సుమారు లక్ష మంది భక్తులు వచ్చినా సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పుణ్యక్షేత్రంలో ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర గోపురాలకు ఒక్కో గోపురానికి ఐదు కలశాలు, రాజ గోపురానికి 7 కలశాలు ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 31న ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉరుకుంద గ్రామంలో ఊరేగించి దేవస్థానం వద్ద 1న గణపతి పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ పీఠాధిపతుల ఆధ్వర్యంలో 3న కలశాల ప్రతిష్టాపన ఉంటుందని తెలిపారు. పీఠాధిపతులతోపాటు, రాష్ట్రమంత్రులు, ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం హెలిపాడ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. డీఎస్పీ ఉపేంద్ర, ఇఒ విజయరాజు, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ సుబ్బరాజు, ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య పాల్గొన్నారు.

హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆస్పరి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గ్రామ సర్వే నాగేంద్రమ్మకు బుధవారం జనసేన సీనియర్ నాయకులు సోమశేఖర్ ఆధ్వర్యంలో సైనికులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం విధులు ముగించుకొని స్వగ్రామం పత్తికొండకు వెళ్తుండగా చిన్నహుల్తి గ్రామ సమీపంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాగేంద్రమ్మకు తమ వంతుగా రూ.29 వేలు అందజేసినట్లు చెప్పారు. బాధితులకు సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఎంపిటిసి రహీంతుల్లా, జనసేన మండల కార్యదర్శి వీరేష్, నాయకులు జగన్నాథ్, మహాదేవ్, అన్వేష్, లోకేష్, తిమ్మప్ప, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జనసైనికులు

దోమలు బాబోయ్.. దోమలు..!

- రోగాల బారిన పడుతున్న ప్రజలు - నివారణ చర్యల్లో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలో గత నెల రోజులుగా 'గుయ్యి'మంటూ దోమలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. దోమకాటుకు గురై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

గ్రామాల్లోని ప్రతి వీధిలోనూ అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఉదయం, సాయంత్రమనే తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇళ్ల నుంచి ఏ చిన్న పని మీద బయటికి వెళ్లాలన్నా భయంతో బయటికి వెళ్లలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. మండలంలో 17 పంచాయతీలు, 23 మజరా గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామ పంచాయతీకి వెళ్లినా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రతి వీధిలోనూ నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నా అధికారులు తమకేమీ తెలియనట్లు చుట్టపు చూపుగా గ్రామాలకు వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

అపరిశుభ్రత దోమలకు నిలయం

అపరిశుభ్రత కారణంగా దోమలు పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీలో మురుగునీరు నిల్వ ఉండడం, దుర్వాసన వెదజల్లడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రత తాండవిస్తున్నా పంచాయతీ కార్యదర్శులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు.

దోమల వల్ల అనారోగ్యం పాలవుతున్నాం

- మల్లేష్, హొళగుంద

గత నెల రోజులుగా దోమల బెడద అధికంగా ఉంది. దోమకాటుకు గురై అనారోగ్యం పాలవుతున్నాం. దోమల నివారణకు మేజర్ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. వారంలో రెండుసార్లు ప్రతి వీధిలోనూ దోమల నివారణకు పాగింగ్ చేయాలి. అధికారులు అలా ఆలోచించకపోవడం బాధాకరం.

చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలి

- నాగేంద్ర, ముద్దటమాగి

గ్రామంలో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అంతంతమాత్రంగా ఉంది. వీధుల్లో నీరు నిల్వ ఉంటున్నాయి. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇంటి నుంచి బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధితులకు న్యాయం చేస్తాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన రెండు గుడిసెలు, అలానే పక్కన ఉన్న ఇంట్లో కూడా పూర్తిగా బట్టలు కాలిపోయిన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఒక కుటుంబానికి రూ.5 వేల చొప్పున రెండు కుటుంబాలకు కలిపి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలానే ఇంటి పక్కనే ఇంట్లో ఉండే బట్టలన్నీ కాలిపోయిన కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు. కాలిపోయిన గుడిసెలో కుటుంబ సభ్యులు వారి ఇంట్లో పెళ్లి ఉందని చెప్పడంతో ఉమాపతి నాయుడు స్పందిస్తూ... పెళ్లి కుదిరిన వెంటనే తనకు తెలియజేయాలని, తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. నాయకులు మారుతిరావు సాకరే, టిడిపి పట్టణ కార్యదర్శి సాకరే ఈరన్న, బినిగిరి తిమ్మప్ప, వార్డు ఇన్‌ఛార్జీ, మాజీ కౌన్సిలర్ సాకరే లక్ష్మణ్, దత్త రఘునాథ్, పొందే రాజ్ కుమార్, అశోక్, జాల్గార గిరి, రవి, రంగస్వామి నాయుడు, రామస్వామి, రంగన్న, అప్సర్ బాష, మా బాష, సుబ్బు, జగదీష్, గిడ్డయ్య, శివ, వీరేంద్ర పాల్గొన్నారు.

సరుకులు అందిస్తున్న యూత్

బాధితులకు అండగా ఉంటామని గుడిసె కృష్ణమ్మ యూత్ నాయకులు నాగనాథనహల్లి రవి, రాఘవరెడ్డి తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ సూచన మేరకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. వారు మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటామని, ఇప్పటికే కపటి గ్రామంలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఆదోని పట్టణం గోకర్ జెండా వీధిలో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. స్పందించిన గుడిసె కృష్ణమ్మ ఆదేశాల మేరకు బాధితుల కుటుంబాల్లో ధైర్యం నింపి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చి, నిత్యావసర సరుకులు అందించి నట్లు చెప్పారు. నాయకులు మురళీ, కపటి మహాదేవ, అల్తాఫ్, భరత్, వీరేష్, చిన్న చిట్టి, విజయ్, ఖాసీం, బాలు ఉన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు (స్పెషల్ మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.344/2023

యం.రఘునందన్. ...వాది

- వర్సెస్ -

షేక్.చాంద్‌బాష. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

షేక్.చాంద్‌బాష తండ్రి షేక్.సాలుఉశేన్,
ఇంటి.నెం.87-1368/1-29ఎ,
ఎల్యూరిఎస్టేట్, ఓమేగా హస్పిటల్‌దగ్గర,
కర్నూలు.వర్కింగ్, ఫైర్ స్టెషన్, శ్రీశైలం,
నంద్యాల జిల్లా.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాది వాది తాలుకు ఇంటి.నెం.52/194/సి/1, (కొత్త నెం.52/4/587) కర్నూలు బాడుగకు తీసుకోని 15-03-2022 నుండి 15-12-2022 వరకు నెలకు రూ.96,300/- ప్రకారం అయిన బాడుగ రూ.8,66,700/- ఇవ్వవలెనని,సదరు మొత్తంపైన 24% ప్రకారము వడ్డీతో చెల్లించమని మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 20-2-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారికోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :20-2-2025

బి. నాగలక్ష్మిరెడ్డి,
వాది పరం అడ్వకేటు,
కర్నూలు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని, కౌతాళం మండలాల సరిహద్దుల్లో ఉన్న కుప్పగల్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ నిమిత్తం స్థలాలను ఆదోని, కౌతాళం రెవెన్యూ అధికారులు, రైల్వే అధికారులతో కలిసి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం పరిశీలించారు. తహశీల్దార్ శివ రాముడు, రజినీకాంత్ రెడ్డి, రైల్వే ఇంజినీర్ ఉమాపతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య పాల్గొన్నారు. అలాగే కోసిగి మండలం ఐరన్‌గల్ గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల సేకరణ నిమిత్తం అధికారులతో కలిసి పరిశీలించారు. తహశీల్దార్ రుద్ర గౌడ్ పాల్గొన్నారు.

హెల్మెట్ రక్షణ కవచం : డీఎస్పీ హేమలత

ప్రజాశక్తి - ఆదోని

బైక్ నడిపే వారు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని డీఎస్పీ మర్రిపాటి హేమలత తెలిపారు. బుధవారం జాతీయ రహదారి భద్రత మహోత్సవాల సందర్భంగా హెల్మెట్ ధరించి టూ టౌన్ పోలీసు స్టేషన్ నుంచి కోట్ల సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, గవర్నమెంట్ హాస్పిటల్ మీదుగా ఎన్‌టిఆర్ సర్కిల్, పిసిఆర్, ఆర్ట్స్ కళాశాల, బసవేశ్వర సర్కిల్, ఆస్పరి బైపాస్, ఆర్‌టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాల ముఖ్య ఉద్దేశం తెలుసుకోవాలన్నారు. ప్రపంచంలో అన్నిటికంటే విలువైనది ప్రాణమని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్స్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మన కోసం ఎదురు చూస్తుంటారని, వారికి మనమే ఆధారమని గుర్తించుకొని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. సిఐలు సూర్య మోహన్ రావు, రామలింగయ్య, గంటా సుబ్బారావు, నల్లప్ప, ఎస్ఐలు నాగేంద్ర, రామనాథ్ ఉన్నారు.

అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డీఎస్పీ

మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షులు నాగేశప్ప

ఉత్సాహాన్ని నింపే ఆత్మీయ సమ్మేళనం

- వైసిపి పట్టణ అధ్యక్షులు నాగేశప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని పలు వార్డుల్లో వైసిపి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు డి.నజీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆదేశాల మేరకు నాగశేషప్ప ఆధ్వర్యంలో 10వ వార్డు కౌన్సిలర్ ఎ.సుధాకర్ అధ్యక్షతన సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశేషప్ప, నజీర్ అహ్మద్, చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్, వార్డు కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడారు. 10వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్యకర్తల సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు అమలు నోచుకోవడం లేదని, ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరిచి వచ్చే ఎన్నికల్లో బుట్టా రేణుక విజయానికి కృషి చేయాలని కోరారు. బడేసాబ్, అమీర్, యూసుఫ్, ఇమ్రాన్, జలీల్, గౌస్ పాల్గొన్నారు.

KURNOOL MUNICIPAL CORPORATION

e-Procurement Notice

Tender Notice No.18-1/General Funds/EE&SE/Knl/24-25 (3 days short tender), dt.29-01-2025 & Tender Notice No.18-2 to 18-5/General Funds/EE&SE/Knl/24-25 (7 days short tender), dt.29-01-2025 & Tender Notice No.18-6 to 18-19/General Funds/EE&SE/Knl/24-25, dt.29-01-2025 & Tender Notice No.2-1 to 2-2/15th Finance Commission Grant/EE&SE/Knl/24-25, Dt. 29-01-2025

Name of the Scheme	General Funds (3 days short tender)	General Funds (7 days short tender)	General Funds/15th Finance Commission Grant
No. of Works	01	04	14/02
Bid document download starting date	31/01/2025 at 5:30 P.M.	31/01/2025 at 5:30 P.M.	01/02/2025 at 5:30 P.M.
Bid document download end date	04/02/2025 at 4:00 P.M.	10/02/2025 at 4:00 P.M.	18/02/2025 at 4:00 P.M.
Last Date & Time for receipt of Bids	04/02/2025 at 5:00 P.M.	10/02/2025 at 5:00 P.M.	18/02/2025 at 5:00 P.M.
Commerical Bid Opening Date	04/02/2025 at 5:30 P.M.	10/02/2025 at 5:30 P.M.	18/02/2025 at 5:30 P.M.

Further details and Corrigendum can be seen @ e-procurement market place at www.tender.eprocurement.gov.in. P.V. Ramalingeswar, Commissioner (F.A.C), Kurnool Municipal Corporation, Kurnool. For contact 9849908497, 9849908470

Sd/- Commissioner
Kurnool Municipal Corporation, Kurnool.